



తెనాలి: కొలకలూరులో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న షర్మిల

కష్టాల్లో తోడుంటాం

- బాధిత కుటుంబాలకు అండగా పార్టీ
- మృతుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం
- తాడికొండ నియోజకవర్గంలో భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర



ఫిరంగిపురం: రేగులగడ్డ గ్రామంలో రూ.3లక్షల చెక్కును అందిస్తున్న భువనేశ్వరి



తాడికొండ: బండారుపల్లిలో బాలయ్య కుటుంబసభ్యులను ఓదార్చుతూ..



తుళ్లూరు: రాయపూడిలో మృతుని కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందించి పరామర్శిస్తూ..

తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు, ఫిబ్రవరి 8: కార్యకర్తలు, నాయకుల కుటుంబాలు కష్టాల్లో ఉంటే వారికి ఎల్లప్పుడు పార్టీ తోడుగా ఉంటుంది. అధైర్య పడ వద్దు. అండగా ఉంటాం.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం ఆమె తాడికొండ నియోజకవర్గంలో పర్యటించారు. గతంలో చంద్రబాబు అరెస్టుతో మనస్థాపంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పి పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారి నివాసాలకు వెళ్లిన భువనేశ్వరి వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఉండవల్లి నుంచి రోడ్డు మార్గంలో ఆమె తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాల్లో పర్యటించారు. తాడికొండ మండలం బండారుపల్లిలో తూమాటి బాలయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డకు చెందిన నల్లజర్ల పెదచెన్నకేశవరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్య లక్ష్మి, కుమారుడు పెదబంగారయ్య, కుమార్తె బాలనరసమ్మలకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. తుళ్లూరుకు చెందిన మోరం సాంబశివరావు, రాయపూడికి చెందిన గోరగంటి మల్లికార్జునరావు, వెంకటపాలేనికి చెందిన లంకా నరసింహారావు కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

ఘన స్వాగతాలు.. ఆప్యాయంగా పలకరింపులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా పర్యటిస్తున్న భువనేశ్వరికి దారిపొడవునా మహిళల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరని చూసేందుకు మహిళలు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తుళ్లూరు వెళ్లే క్రమంలో గరికపాడులో మహిళలు, వృద్ధులను ఆమె పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గరికపాడు నుంచి వస్తున్న క్రమంలో పనుల్లో నిమగ్నమైన మహిళా కూలీలు భువనేశ్వరి రాకను గమనించి ఆమెను చూసేందుకు పరుగులు తీశారు. పొలాల్లో నుంచి వస్తున్న వారిని గమనించిన భువనేశ్వరి కారును ఆపి వారితో కొద్దిసేపు గడిపారు. పొన్నెకల్లులో మహిళలు భువనేశ్వరికి హారతులతో స్వాగతం పలికారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద నిడుముక్కల, మోతడక గ్రామానికి చెందిన మహిళలు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అమరావతి దీక్షా శిబిరం వద్ద మహిళలు, రైతులు, భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డలో షిరిడీసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. తుళ్లూరు, రాయపూడి, వెంకటపాలెం గ్రామాల్లో రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు జిల్లా, నగర టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, డేగల ప్రభాకర్, గుంటూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని విజయలక్ష్మి అమరావతి రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, గుర్రం చంటి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తా..

- రచ్చబండ ద్వారా ప్రజలు కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా..!
- నాన్న నడిపిన పార్టీ పగ్గాలు పట్టుకుని మీ సేవకే వచ్చా
- జగనన్న వచ్చాక పరిశ్రమలు లేవు.. ఉద్యోగాలు లేవు
- ఇదే పాలన కొనసాగితే యువకులు రాష్ట్రం విడిచి వెళ్లాల్సిందే
- సంక్షేమం పేరుతో మట్టికుండ ఇచ్చి వెండి కుండ లాగుతున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో లిక్కర్, మట్టి మాఫియా, భూదందాలు తప్ప పాలనలేదు
- కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం
- కొలకలూరు రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8: తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రచ్చబండ ద్వారా నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అదే బాటలో తాను కూడా పయనిస్తూ మీ ముందుకు వచ్చాననికాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి షర్మిల హాజరయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ తన తండ్రి దివంగత రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజానాయకుడిగా మిగిలారన్నారు. నాన్న నడిచిన బాటలోనే నడుస్తూ కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు మంచి చేస్తానన్నారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నోటితోనే విని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయాలని వచ్చానని తెలిపారు. వైసీపీ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. జగనన్న పాలనలో లిక్కర్, మట్టి, ఇసుక, భూ దందాలు పెరిగిపోయాయని ప్రజాపాలన గాలికొదిలేశారని విమర్శించారు. తక్కువ ధరలకు భూములు కొని వాటిని పేదల ఇళ్ల పట్టాల పేరుతో వేల కోట్లు కొట్టేశారు. వేలమంది లబ్ధిదారులకు ఇల్లు ఇచ్చామని ప్రచారం చేస్తున్నారు క్షేత్రస్థాయిలో మాత్రం ఇల్లు రాలేదు.. పట్టాలు ఇవ్వలేదని ప్రజలు చెబుతున్నారని అన్నారు. అమ్మఒడి పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15,000 ఇస్తానని ఆ నాడు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చి తరువాత ఒక్క బిడ్డకే ఇస్తామని అది కూడా సంవత్సరానికి రూ.12,000 ఇస్తూ తల్లులను మోసం చేశాడని దుయ్యబట్టారు. మహిళలందరూ గమనించాలని సంవత్సరానికి ఇచ్చే రూ.10వేలు కనీసం కుటుంబ ఖర్చులకైనా సరిపోతాయా.. మరో బిడ్డ ఉన్న తల్లులు ప్రైవేటు స్కూల్‌లో చదివించాలంటే ఫీజులు ఎంత ఖర్చు అవుతాయో ఆలోచించాలన్నారు. జగనన్న ఇచ్చే సంక్షేమ పథకాల లబ్ది మట్టి కుండ చేతిలో పెట్టి వెండికుండ లాక్కునట్లు ఉందన్నారు. అందుకు పెంచిన ధరలే సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగనన్న కనీసం పోలవరం ప్రాజెక్టును కొంచెం కూడా ముందుకు నడపలేకపోయారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఫలితంగా యువకుల నిరుద్యోగులుగా రాష్ట్రం విడిచిపెట్టి వెళ్ళాల్సి వస్తున్నదన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రంలో యువకులు పొరుగు రాష్ట్రాల్లో బతుకుదెరువుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి దగా డీఎస్సీగా చూపారని జగనన్న పాలనను ఎండగట్టారు. రాష్ట్రంలో లిక్కర్, భూదందాలు, ఇసుక మాఫియాలతో రాష్ట్రం అట్టుడుకుతోందని అన్నారు. ఇదే పాలన కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనను జనం గమనించి వచ్చే ఎన్నికల్లో రాజన్న, ఇందిరమ్మ రాజ్యాన్ని అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమయ్యే రోజే రాహుల్‌గాంధీతో తొలిసంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదామీద పెట్టిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పదని మంచి చేసే వారికే ఓటు వేయాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులను ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడని అవినీతి పార్టీల నుంచి ప్రజలు నిస్సందేహంగా వారు ఇచ్చే డబ్బులు తీసుకోవచ్చన్నారు. అవి మీ నుంచి దోచుకున్న డబ్బేనని వివిధ రకాల పన్నులు, పెంచిన నిత్యావసరాల ధరలు, కరెంట్ ఇతర వాటి నుంచి వసూలు చేసినవేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజన్నబిడ్డగా తనను గెలిపించుకోవాలని ఆమె కోరారు. తొలుత దివంగత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి షర్మిల, కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి కనుమూరి బాపిరాజు, గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ జేడీ శీలం, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు కొప్పుల రాజు స్థానిక పార్టీ నాయకులు చందు సాంబశివుడు, దారా రామకృష్ణ, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

ఆశాలపై ఉక్కుపాదం

- ఎక్కడికక్కడ నోటీసులు.. అరెస్టులు
- చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు
- ఎన్నారై సమీపంలో జాతీయ రహదారిపై మెరుపు ధర్నా
- బైఠాయించిన మహిళలను ఈడ్చివేసి స్టేషన్లకు తర లింపు
- వడ్డేశ్వరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆశాల నిర్బంధం



ఆశా కార్యకర్తలను లాగి పడేస్తున్న పోలీసులు



విజయవాడ-గుంటూరు హైవేపై కొలనుకొండ వద్ద రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఫిబ్రవరి 8: సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సీఐ టీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గురువారం చలో విజ యవాడకి పిలుపునిచ్చింది. ఈ ఆందో ళనకు అనుమతి లేదని ఎక్కడికక్కడ ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలకు పోలీసులు తొలుత నోటీసులు జారీ చేశారు. అయినా చలో విజయవాడకు బయల్దేరగా అరెస్టు చేసి వారిని స్టేషన్లలో నిర్బంధించారు. ఈ క్రమంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా యి. ఉదయం 9 గంటల సమ యంలో ఆశా వర్కర్లు వందల సంఖ్య లో మంగళగిరి మండలం చినకాకాని వైజంక్షన్ వద్దకు చేరుకుని ప్రదర్శనగా ఏపీఐఐసీ భవన్‌లోని కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధ మయ్యారు. వీరి ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఎన్నారై ఆస్పత్రి వద్ద గౌతమ బుద్ధ రోడ్డుపై ఆశా వర్క ర్లు బైఠాయించి మెరుపు ధర్నాకు దిగారు. మధ్యా హ్నం ఒకటిన్నర వరకు ధర్నా కొనసాగడంతో జాతీయ రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లు, కల్యాణ మండపాలకు తరలించారు. ఆశా వర్కర్లు ప్రతిఘటించడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో పలువురు సొమ్మసిల్లి పడిపోగా, గాజులు తదితరాలు గుచ్చుకోవడంతో పలువురి చేతులకు రక్తగాయాలయ్యాయి.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలచే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలేదని విమర్శించారు. వేతనాలు పెంచాలని కోరుతున్న ఆశావర్కర్లను, సీఐటీయూ నాయకురాలు ధనలక్ష్మిని చర్చలకు పిలిచి అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. తాడేపల్లి వద్ద అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి ఇళ్లలో ఉన్న వారిని మగపోలీసులతో అరెస్టు చేసి తీసుకురావడం దారుణమన్నారు. తమ నాయకురాలు ధనలక్ష్మి ఏమైందో ఇంత వరకూ చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన ఆశా వర్కర్లను టీడీపీ నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకుని అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు.

ఎక్కడికక్కడ నిర్బంధకాండ

బాపట్ల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల ఛలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధకాండకు తెగబడ్డారు. ఆశాలలో క్రియాశీలకంగా ఉండే వారి కదలికల మీద బుధవారం నుంచే నిఘా పెట్టారు. మార్టూరు, చినగంజాం, వేమూరు, కొల్లూరు ఇలా దాదాపు అన్ని మండలాల్లో ఆశాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లతోపాటు కీలకమైన చెక్‌పోస్టుల దగ్గర గురువారం నిఘా పెట్టి విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. నోటీసులు జారీచేసి ఛలో విజయవాడకు అనుమతి లేదని, కాదని వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేమూరులో దాదాపు 50మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కొల్లూరు, చినగంజాం పరిధిలోని ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ బయలుదేరిన ఆశాలను పోలీసులు అరెస్టు చేసి బాపట్ల స్టేషన్‌కు తరలించగా జీబీసీరోడ్డుపై రాస్తారోకో చేశారు. రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు.

గేట్లకు తాళాలు వేసి నిర్బంధం..

చలో విజయవాడలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశా వర్కర్లు తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ప్రాంతానికి వచ్చి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగారు. సమాచారం తెలిసిన పోలీసులు విజ్ఞాన కేంద్రం గేటుకు తాళాలు వేసి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ సహా ఆశా వర్కర్లందరినీ నిర్బంధించారు. దీంతో సీపీఎం నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చి తాళాలు తీయాలని పోలీసులతో వాదులాటకు దిగారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని అనంతరం గేటు తాళాలు తీశారు. ఈ మధ్యలో కొందరు ఆశాలు గేటు దూకి జాతీయ రహదారిపైకి చేరుకుని వాహనాలను అడ్డుకుని నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎంత సేపటికి వారు నిరసన విరమించక పోవడంతో పోలీసులు బలవంతంగా ఈడ్చివేశారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కార్యకర్త లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం వారిని తాడేపల్లి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు.



పోలీసులు అరెస్టు చేస్తున్న క్రమంలో సొమ్మసిల్లిన ఆశ కార్యకర్త



భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

రోడ్డు నిర్మాణం పేరుతో మట్టి దోపిడీ

- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



రోడ్డు పక్కన తవ్వేసిన మట్టి



ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

చుండూరు ఫిబ్రవరి 8: రోడ్డు నిర్మాణం పేరుతో కాంట్రాక్టర్ పెద్దఎత్తున మట్టి తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంగలకుదురు-చండమూడి (ఏడీ రోడ్డు) మార్గంలో చుండూరు-మోదుకూరు మధ్య రోడ్డు నిర్మాణానికి రూ.3.28 కోట్లు వర్కు ఆర్డర్ విడుదలైంది. ఇందులో మోదుకూరు గ్రామంలో సిమెంటు రోడ్డు, సైడ్ డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలి. ఊరిలో రోడ్డుకు ఇరువైపులా మాత్రమే సైడ్ డ్రైన్స్ నిర్మించాల్సి ఉండగా ఊరు పొలిమేరలు దాటి కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్‌తో పెద్దఎత్తున సైడ్ కాల్వలు తవ్వించి వచ్చిన నల్లమట్టిని ట్రాకర్లతో తెనాలిలోని ప్లాట్స్‌కు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పెద్ద సైడ్ కాల్వలు తవ్వి నిర్లక్ష్యంగా వదలి వేయడంతో ఇటీవల చిన్నారులు ఆడుకుంటూ దాంట్లో పడి ప్రమాదాలకు గురయ్యారు. నియోజకవర్గంలో రూ.36 కోట్ల మేర రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ రాకపోయినా ఇక్కడ మాత్రం పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడం మట్టి తవ్వకాలు జరిపి అమ్మకాలు చేపట్టడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతానికి వచ్చి పరిశీలించాలని కోరుతున్నారు.

టీడీపీ వైపు కౌన్సిలర్ల చూపు?

- వైసీపీలో గుర్తింపులేదని ఆవేదన
- అద్దంకిలో మారుతున్న సమీకరణలు

అద్దంకి, ఫిబ్రవరి 8: అద్దంకి మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్ది నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. ఈక్రమంలో మున్సిపాలిటీలో కూడా కొంతమంది కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ప్రధానంగా ఆయా వార్డులలో పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టకపోవటం, వైసీపీలో తగిన గుర్తింపు లేదని టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత చేరాలన్న ఉద్దేశంతో వారున్నట్లు సమాచారం. నోటిఫికేషన్ రాకముందే పార్టీ మారితే ఇబ్బంది పెడతారన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. 20 మంది కౌన్సిలర్లకు వైసీపీ నుంచి 13 మంది, టీడీపీ నుంచి ఏడుగురు గెలుపొందారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటుఖాయమని పలు సర్వేలు చెప్పుండటంతో అందుకనుగుణంగా సమీకరణలు మారుతున్నాయి. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిస్తే ప్రభుత్వం మారిన తర్వాత వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపజేసుకోవచ్చన్న ఆలోచనతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నట్లు తెలుస్తోంది. బాచిన కృష్ణచైతన్యతో అడుగులు వేసేందుకు మరికొంత మంది కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయాలు వైసీపీ నేతల దృష్టికి పోవడంతో ఇటీవల కౌన్సిలర్లను పిలిపించుకుని వ్యక్తిగతంగా మాట్లాడినట్లు సమాచారం. ఈసందర్భంగా పలువురు కౌన్సిలర్‌లు తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని ఏకరువు పెట్టినట్లు తెలిసింది. అయితే, ఒకరిద్దరు కౌన్సిలర్‌లను పార్టీలోకి చేర్చుకునే విషయంలో టీడీపీ నాయకత్వం కూడా విముఖత చూపించినట్లు తెలుస్తుంది.

దిక్సూచి DIKSUCHI

టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో

బీబీఏ, ఎంబీఏ



గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం)- బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని స్పెసిఫిక్ అండ్ జనరిక్ బిజినెస్ మాడ్యూల్స్, ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, అకడమిక్ డెవలప్‌మెంట్స్, టూరిజం అండ్ బిజినెస్ స్టడీస్ తదితర అంశాలతో రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు, స్టడీ టూర్లు ఉంటాయి. నెల్లూరు సహా గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, గోవా క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నా యి. గోవాలో ఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రమే ఉంది. ఐఐటీటీఎం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఐఏటీ) లేదా నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్): ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 375 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 112, భువనేశ్వర్ క్యాంపస్‌లో 75, నోయిడా క్యాంపస్‌లో 113 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. సీయూఈటీ 2023 స్కోర్ ఉన్నవారు ఐఏటీ 2024 రాయనవసరం లేదు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/10+2/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్): ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సుని రూపొందించారు. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్ సబ్జెక్టులతో పాటు స్పెషలైజేషన్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి ఆసక్తి మేరకు టూర్ గైడింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అడ్వెంచర్ టూరిజం, సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. చివరి సెమిస్టర్లో ఆన్ జాబ్ ట్రెయినింగ్ ఉంటుంది.

సీట్లు: మొత్తం 750 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 334, భువనేశ్వర్ క్యాంపస్‌లో 112, నోయిడా క్యాంపస్‌లో 189, గోవా క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మ్యాట్/క్యాట్/సీమ్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఒకటి రాసి అర్హత పొందిన అభ్యర్థులు సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్కోర్ కార్డ్ వ్యాలిడిటీ 2023 జూన్ 1 నుంచి 2024 మే 31 మధ్య ఉండాలి.

ఐఏటీ 2024 వివరాలు: ఈ టెస్ట్‌ని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం వంద మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **ఐఏటీ 2024 తేదీ:** జూన్ 9
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

జాబ్ కార్నర్

ఐడీబీఐ బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 500

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐడీబీఐ బ్యాంక్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మణిపాల్(బెంగళూరు), నిట్టే(గ్రేటర్ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఆ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 2024 జనవరి 31 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. అందులో ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా తుది ఎంపికలు చేపడతారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 12
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
వెబ్‌సైట్: www.idbibank.in/

ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్-2024) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5 తరగతుల బోధనకు పేపర్-1(ఎ, బి); 6 నుంచి 8 తరగతుల బోధనకు పేపర్-2(ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు: పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

పరీక్ష రుసుము: రూ.750
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
పరీక్షల నిర్వహణ: ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9
వెబ్‌సైట్: aptet.apcfss.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/AeojJL0లో చదవండి.

'ఈగల్' చిత్రంలో మునుపెన్నడూ చూడని రవితేజను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. కంటెంట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. 'ఈగల్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను కార్తీక్ మీడియాతో పంచుకున్నారు.

రాంబో, టెర్మినేటర్ తరహాలో...

కార్తీక్ ఘట్టమనేని



- 'ఈగల్'లో కథానాయకుడు సాధారణ పత్తి రైతులా కనిపిస్తాడు. కానీ ఓ అంతర్జాతీయ సమస్యపైన అతను పోరాటం చేస్తుంటాడు. 'రాంబో', టెర్మినేటర్' లాంటి సినిమాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. మనం కూడా అలాంటి ఒక సినిమా తీయాలనే ప్రయత్నంలోంచే 'ఈగల్' పుట్టింది. ఇదొక అద్భుతమైన యాక్షన్, డ్రామా ఎంటర్టైనర్. ప్రేక్షకులను అలరిస్తుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేయాలనేది దర్శకుడిగా నా కల. అది 'ఈగల్'తో నెరవేరింది.
- పక్షుల్లో గద్దకు చాలా సునిశితమైన దృష్టి ఉంటుంది. సుదూరాన ఉన్న లక్ష్యాన్ని సైతం చూసి వేటాడుతుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కూడా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగల నైపుణ్యం ఉంటుంది. అందుకే 'ఈగల్' టైటిల్ పెట్టాం. హిందీలో 'సహదేవ్ వర్మ' టైటిల్‌తో విడుదల చేస్తున్నాం.
- 'ధమాకా' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే సమయంలో రవితేజకు కథ చెప్పాను. 'మంచి ఎంటర్టైనర్ అవుతుంది చేద్దాం' అని వెన్నుతట్టారు. ఈ సినిమా అంతటా ఆయన పాత్ర ఒకేలా ఉంటుంది. ఆయన ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ. ఆహారపు అలవాట్లు, నిద్రవేళలు కచ్చితంగా పాటిస్తారు.
- ఈగల్ సౌండ్ డిజైన్‌కే ఆరునెలలు పట్టింది. యూరప్‌లో రియల్ గన్స్‌తో షూట్ చేసి ఆ సౌండ్‌ని రికార్డ్ చేశాం. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సహకారం మరువలేనిది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు కావలసిన వనరులు సమకూర్చేవారు.
- ఈ చిత్రంలో నవదీప్ నటన ఆశ్చర్యపరుస్తుంది. అనుపమా పరమేశ్వరన్ కథను ముందుకు నడిపించే పాత్రను పోషించారు. త్వరలో తేజ సజ్జతో ఓ చిత్రం చేస్తున్నాను.

ట్రూ లవర్ ఈ వాలెంటైన్ విన్నర్



మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన తారాగణంగా రూపొందిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ఈ ప్రేమకథా చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదని చెబుతున్నారు. తెలుగువాళ్లకూ ఈ సినిమా బాగా నచ్చుతుంది. పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మణికందన్, గౌరీప్రియ నటన ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. 'బేబీ' హిందీ రీమేక్‌లో నేను నటించడం లేదు' అని తెలిపారు. మారుతి మాట్లాడుతూ 'ట్రూ లవర్' కథను దర్శకుడు సహజంగా తెరకెక్కించాడు. దర్శకుడి ప్రతిభ అబ్బురపరుస్తుంది. ప్రేమికులే కాదు కుటుంబం అంతా కలసి చూసే సినిమా ఇది' అన్నారు. మణికందన్ మాట్లాడుతూ 'పక్కా స్ర్కీన్‌ప్లేతో తీసిన సినిమా ఇది. ఇక్కడి ప్రేక్షకులు నన్ను తెలుగు నటుడిగానే చూస్తున్నారు. మారుతి, ఎస్‌కేఎన్ రిలీజ్ చేయడం వల్ల ఈ సినిమా స్థాయి పెరిగింది' అని చెప్పారు. శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ 'ఈ చిత్రం తమిళ ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అన్నారు.

నవ్వించే గూఢచారి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో ఆదితి సోని నిర్మించిన సినిమా ఇది. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా వెన్నెల కిశోర్ కనిపిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే గూఢచారి ఒక పెద్ద కేసుని ఎలా పరిష్కరించాడన్న అంశంతో చిత్రాన్ని రూపొందించాం. వెన్నెల కిశోర్, సంయుక్త గూఢచారి పాత్రలు పోషించారు. వాళ్ల బాస్‌గా మురళీశర్మ కీలక పాత్ర చేశారు.' అని దర్శకుడు చెప్పారు. గూఢచారి చిత్రాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుందని నిర్మాత తెలిపారు. త్వరలో పాటలు, ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

లవ్ జిహాద్ డ్రిల్



అమెరికాలో డాక్టర్‌గా సెటిల్ అయిన హరనాథ్ పొలిచర్ల సినిమా మీద మమకారంతో ఇండియా వచ్చి చిత్రాలు తీస్తుంటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరనాథ్ మరెన్నో సినిమాలు తీయాలనీ, 'డ్రిల్' చిత్రం విజయవంతం కావాలనీ కోరారు. డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఆ కారణంగానే ఇప్పటివరకూ ఎనిమిది సినిమాలు తీశా. అమెరికాలో డాక్టర్ వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఎప్పటికప్పుడు సినిమా అప్డేట్స్ తెలుసుకుంటుంటాను. లవ్ జిహాద్ మీద తెలుగులో ఇంతవరకూ ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్ రెడీ చేసుకుని ఇండియాకు వచ్చి సినిమా తీశా. ఇంతవరకూ నేను చేసిన సినిమాలకు ఇది భిన్నంగా ఉంటుంది' అన్నారు. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో భవ్య, సిషిగంధ, తనికెళ్ల భరణి, జెమినీ సురేశ్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ , జబర్దస్త్ ఫణి తదితరులు నటించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/xepzBEN లో చదవండి.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ



- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీని తలపించేలా వుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంచనాలు చూస్తే కొండంత.. ఖర్చులు చూస్తే పిసిరంత సామెతలా రాష్ట్ర బడ్జెట్ వుందని మండిపడ్డారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో అభివృద్ధి అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు 11.58 లక్షల కోట్లు, మద్యం బాండ్లు 16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు 1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు 94,928 కోట్లు, డిస్కం బకాయిలు 27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, ఇలా వైసీపీ హయాంలో రాష్ట్ర అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. 2019లో టీడీపీ తీసుకున్న దానికంటే నాలుగు రెట్లు అధికంగా వైసీపీ ప్రభుత్వం అప్పు తీసుకొని ఏపీని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను జగన్ సర్కార్ భారీగా పెంచడంతో పాటు విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా వైసీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడలేదన్నారు. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌ల్లోనూ వెయ్యి కోట్ల అవినీతి, నాడు-నేడు పేరుతో స్కూళ్లకు రంగులు వేసి రూ.3 కోట్ల అవినీతికి వైసీపీనేతలు పాల్పడ్డారన్నారు. జగనన్న విద్యా దీవెనలో 7 లక్షల మంది విద్యార్థులకు వాత పెట్టారని, మద్యం మీద వచ్చే డబ్బుతో సీఎం జగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. నాసిరకం మద్యంతో 30 వేల మందిని జగన్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి సున్నా వడ్డీ పంట రుణాలను రూ.5లక్షల నుంచి రూ.3లక్షలకు కుదించారన్నారు. జీవోనెం.217 ద్వారా మత్స్యకారుల కడుపు కొట్టారని, నేతన్నహస్తం పేరుతో నేతన్నల కుటుంబాలను దగా చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు దారి మళ్లించి 30 పథకాలను రద్దు చేశారని యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు.

మెగా కాదు.. దగా డీఎస్సీ



- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 8: జగన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 50,892 టీచర్ ఖాళీలు ఉంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వటం నిరుద్యోగులను వంచించటేమన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. జనవరి 1న జాబ్‌క్యాలండర్ విడుదల చేస్తారని, నాలుగున్నరేళ్ళలో జగన్ చేసింది ఏమీ లేదన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లేలా మంత్రి బొత్స కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా చేసిన మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ ఏమయ్యాయనే ప్రశ్నకు జగనే సమాధానం చెప్పాలన్నారు. జగన్ నిర్వాకంతో దేశవ్యాప్తంగా 11శాతం నిరుద్యోగం ఉంటే, ఏపీలో 24శాతం ఉందన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దేనన్నారు. కల్తీ మద్యం అమ్మకాల్లో మద్యాంధ్రప్రదేశ్‌గా గంజాయి ఉత్పత్తిల్లో రాష్ట్రాన్ని నెం.1గా చేసి గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పాఠశాల విద్య ఆర్జేడీ బాధ్యతల స్వీకారం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8: గుంటూరు జోన్ (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి గురువారం డీఈవో కార్యాలయంలో ఆర్జేడీ విభాగంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎ.తిరుమలేష్, గౌరవాధ్యక్షులు జె.సురేష్‌కుమార్, రాష్ట్ర కేంద్ర సహాధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు సీజే మణికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్వీ నాగమణి, తెనాలి డివిజన్ అధ్యక్షులు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మునిసిపల్ ప్రతినిధులు జిలానిబాషా, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, ఎయిడెడ్ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధి జయప్రద, ఎంఈవో రోజ్‌లాండ్, ఉమ్మడిజిల్లా పరీక్షల బోర్డు సెక్ర టరీ లలితప్రసాద్, ఎస్టీయూ నేతలు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, జోసెఫ్ సుధీర్‌బాబు తదితరులు పుష్ప గుచ్ఛాలు అందజేసి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బడ్జెట్‌లో మోసపు మాటలు, అంకెల గారడీ



మార్ఫింగ్ ఫోటోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జీవీ, అరవిందబాబు తదితరులు

- వైసీపీ పాలనలో రూ.11.58 లక్షల కోట్ల అప్పులు
- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: అంకెలగారడీ, మాయమాటలు, మోసపు మాటలు తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ కనిపించడం లేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.11.58 లక్షల కోట్లు అప్పుల పాలు చేశారని అన్నారు. మరో పక్క జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 లక్షల కోట్లుపైన దోచుకున్నాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి లూటీ వలన రాష్ట్రంలో సంక్షేమం తగ్గిపోయిందని, కేవలం 14 శాతం మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని అన్నారు. గోదావరి, పెన్నా అనుసంధానం వలన రెండు పంటలు పండిచు కోవచ్చునన్నారు. చంద్రబాబునాయుడు ప్రారంభించిన అనుసంధానం పనులు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాకం వలన పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు శంకుస్థాపనచేసి నిధులు కేటాయించపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. రాబోయే టీడీపీ జనసేన ప్రభుత్వంలో వరికపూడిశల కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు రైతులకు డబ్బులు ఇవ్వకుండా దేశం డ్రిప్ ఇరిగేషన్ రెండవ స్థానంలో ఉందని చెప్పుకోవడాని సిగ్గుందా? అన్నారు. 23వేల టీచరు పోస్టులు ఉంటే కేవలం 6,100 ప్రకటించడం నిరుద్యోగలను వంచించడమే అన్నారు. రాష్ట్రంలో పేటీఎం బ్యాచ్ అరాచక చర్యలు శృతిమించుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు యోగా చేసిన ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్‌చేసి అమిత్‌షా కాళ్ళు మొక్కుతున్నట్లు పెట్టడం అత్యంత దుర్మార్గం, నీచమైన చర్యయని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డిలా రాష్ట్రప్రయోజనాలు తాకట్టుపెట్టి సొంత ప్రయోజనాల కోసం ప్రధాని కాళ్ళు పట్టుకోలేదని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ చర్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నన్నెంతో అగౌరవ పరిచారు

- ఏ కార్యక్రమానికి పిలుపులేదు
- నర్సరావుపేటలో జగన్ హామీ నెరవేరలేదు
- ఆత్మీయ సమావేశానికి వచ్చేవారికి బెదిరింపులు
- త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తా: ఎమ్మెల్సీ జంగా



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: ముప్పై ఐదేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూచూడని అగౌరవాన్ని ఈఐదేళ్లలో చూశానని, అనుభవించానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. గురువారం రాత్రి పిడుగురాళ్లలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆనాడు నరసరావుపేటలో జగన్ నాకు మాటిచ్చాడని.. ఎమ్మెల్సీని చేసి ఆ తర్వాత మంత్రివర్గంలో తర పక్కనే కూర్చోబెట్టుకుంటానన్న జగన్ ఆ తర్వాత మాట నిలబెట్టుకోలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ పదవి జగన్ ఇస్తానన్నా.. ఇప్పుడే ఇస్తే ఎన్నికల్లో తన గెలుపునకు పనిచేయడేమోనని కాసు చెప్పడంతో ఎన్నికల య్యాక మాత్రమే తనకు పదవి ఇచ్చారన్నారు. ఎన్నికల్లో గెలిచాక పిడుగురాళ్లకు వచ్చి ర్యాలీ చేసిన కాసు ఆ కార్యక్రమానికి తనను పిలవలేదన్నారు. నాలుగున్నరేళ్లలో ఏకార్యక్రమానికి పిలుపు లేక పోగా నాకార్యాలయానికి ఎవరినీ రానివ్వకుండా నిఘా పెట్టారన్నారు. అదే విషయాన్ని జగన్‌కు, పార్టీ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదని జంగా ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఆనాడు పార్టీ పెడతాడో లేదో తెలియని పరిస్థితుల్లో జగన్ కోసం పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసిన నన్ను 2019 ఎన్నికల తరువాత నన్ను అన్ని కార్యక్రమాలకు దూరం పెట్టారని జంగా ఆవేదన వెల్లగక్కారు. అంతేకాకుండా నా ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడం నన్నెంతో బాధించిందని, తనకు గాని.. గామాలపాడు సర్పంచ్‌గా వున్న నా కుమారుడు సురేష్‌కి కూడా సమాచారం ఇవ్వకుండా ఎలా సమావేశం పెడతారని ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. మీ పదవి కోసం, సంపాదన కోసం గ్రామాల్లో చిచ్చుపెట్టొద్దని, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా చేస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న నన్ను ఎన్నో ఇబ్బందులు పెట్టినా ఇప్పటిదాకా ఓర్చుకున్నానన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా నా మాట వినే పరిస్థితి లేకుండా చేయడం నన్నెంతో బాధించిందన్నారు. గురజాల ప్రజలకు తానేంటో తెలుసని, నా చివరి శ్వాస వరకు గురజాల అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికే పాటుపడతానని జంగా స్పష్టం చేశారు. ఆత్మీయ సమావేశానికి పలు గ్రామాల నుంచి రానివ్వకుండా భయపెట్టి బెదిరించారని గుర్తుచేస్తూ అలా ఎన్నటికీ బెదిరిపోరని.. ఎదురు తిరిగే రోజులు దగ్గరలోనే వున్నాయన్నారు. ఈదఫా ఎమ్మెల్యే సీటు కేటాయించమని వైసీపీ పెద్దలను అడిగా.... కానీ వినే పరిస్థితి అక్కడ లేదన్నారు. బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తూ ఆత్మవంచనతో బతకలేరని, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తానని జంగా తెలిపారు. ఆత్మీయుల మనోభావాలను గుర్తుంచుకొని ఓనిర్ణయానికి త్వరలో వస్తానన్నారు. 2009లో గురజాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆత్మీయులందరినీ జగన్ దూరం చేసుకుంటున్నాడని, నేను జగన్ అభిమానినే అయినా పరిస్థితి బాగోలేదు. బడుగు బలహీనవర్గాల వారందరం జంగావైపే వుంటామన్నారు. ఆత్మీయ సమావేశానికి గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 4వేల మంది హాజరయ్యారు. వేదికపై అత్తోట రామనరసింహారావు, నంద్యాల ధనుంజయరెడ్డి, గుండా శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు,మద్దాళి సుబ్బయ్య, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, ముడేల సుబ్బారెడ్డి, మాశెట్టి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విష్ణుపురం-మోటుమర్రి రైల్వే డబ్లింగ్‌కు

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

- రూ. 1,746.20 కోట్ల నిధుల మంజూరు
- కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయ మార్గంగా సేవలు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విష్ణుపురం - మోటుమర్రి రైల్వే సింగిల్‌లేన్‌ని డబ్లింగ్ చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కాజీపేట మార్గానికి ఇది ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనుండటంతో ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది. ఇప్పటికే నల్లపాడు - బీబీ నగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకి ఈఏడాది బడ్జెట్‌లో నిధులను కేటాయించిన రైల్వే శాఖ తాజాగా 88.82 కిలోమీటర్ల విష్ణుపురం-మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌కు నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు వలన సరుకు రవాణ గణనీయంగా పెరగనుంది. అలానే కాజీపేట మార్గంలో రైళ్ల రద్దీ కూడా తగ్గుతుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. విష్ణుపురం సమీపంలో 4వేల మెగా వాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్నది. అలానే చుట్టుపక్క అనేక సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఎఫ్‌సీఐ సైడింగ్‌లు, వేర్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజ్‌లు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు ఉండటంతో రాబోయే రోజుల్లో ఇదొక సరుకు రవాణ హబ్‌గా మారనుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌ని ఆమోదించింది. ఇందుకోసం రూ. 1,746.20 కోట్లు కేటాయించింది.

10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలు ..

డబ్లింగ్ చేపట్టనున్న ఈ సెక్షన్‌లో 10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలుని కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే మోటుమర్రి ఒక జంక్షన్‌గా మారింది. దీంతో అక్కడ రైల్ వోవర్ రైల్ నిర్మించకపోతే రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తలెత్తే అవకాశంవుంది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని నిర్మించాలని నిర్ణయించింది.

గిరిజన విద్యార్థుల మృతి సీఎంకు పట్టదా ?

- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్

గుంటూరు, ఫిబ్రవరి 8: ఏడాదిలో 40 మంది గిరిజన విద్యార్థులు మృతి చెందుతుంటే సీఎం జగన్ రెడ్డికి పట్టదా? అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిట్టంపాడు గిరిజన బాలిక మరణంపై సెంట్రల్ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులకు డోలీల కష్టాలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఐదేళ్ల అధికారం పూర్తి కావస్తున్నా జగన్ రెడ్డి ఏజెన్సీ గిరిజన గ్రామాలలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. రోడ్లు లేక, వైద్యం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. జగన్ రెడ్డి నిర్లక్ష్య ధోరణితో నేడు ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఆదిమకాలం నాటి పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం గిరిపుత్రులనే హెల్త్ అసిస్టెంట్లను నియమిస్తే వారినీ తొలగించారు. గిరిజన గూడేల్లో హెల్త్ చెకప్‌లను నిలుపుదల చేశారని మండిపడ్డారు. గిరిజన హాస్టళ్లలో గత ఏడాది నుంచి నేటి వరకు రాష్ట్రంలో దాదాపు 40 మంది గిరిజన విద్యార్థులు అనారోగ్యాల బారినపడి మృత్యువాత పడ్డారన్నారు. ఇటీవల విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం, గిరిశిఖర గ్రామం, చిట్టంపాడుకు చెందిన ఆరేళ్ల బాలిక అనారోగ్యంతో మరణించిడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేట,ఫిబ్రవరి8: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024 - 25 సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 950 మంది, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 582 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకొని నిర్ణీత సమయంలో కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. హాల్ టిక్కెట్లు లేని వారు నవోదయ వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కూడా ఆయన తెలిపారు.

ఎన్నికల సభలా ఆసరా చెక్కుల పంపిణీ

కొల్లూరు, ఫిబ్రవరి 8: ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ట్రాఫిక్ మళ్లించి మరీ నడిరోడ్డుపై నిర్వహించడం పలు విమర్శలకు దారి తీసింది. గురువారం మండల కేంద్రం కొల్లూరులో మండల వనరుల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి వాహన రాకపోకలు నిలిపి వేసి ఇతర మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించారు. వైసీపీ నాయకులు దీనిని ఎన్నికల ప్రచార సభలాగా వినియోగించుకున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని, లేదంటే అందవని మహిళలను భయపెట్టే విధంగా మంత్రి మేరుగు నాగార్జున, ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుల ప్రసంగం ఉందని, ప్రభుత్వ కార్యక్రమమా! ఎన్నికల ప్రచారమా అని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా వేలిముద్రలు వేయాలని డ్వాక్రా మహిళలను, ఇళ్ల స్థలాలు పొందిన వారిని మభ్యపెట్టి సభకు రప్పించారని మహిళలే సభా ప్రాంగణం వద్ద బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. మధ్యాహ్నం 1 గంటకు సభ అని పిలిపించి రాత్రి 7 గంటలకు పైగా అక్కడే ఉండేలా చేయడంతో కార్యక్రమానికి వచ్చిన మహిళలు అసహనానికి గురయ్యారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- పాత నేరస్తుడిగా గుర్తింపు
- మృతుడు ప్రకాశం జిల్లా వాసి

వేమూరు, ఫిబ్రవరి 8: మండలంలోని జంపని గ్రామ శివారులో ఉన్న సినిమా హాలు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అతనిని ప్రకాశం జిల్లా పేర్నమెట్ట మండలం పేర్ల మాణ్యం గ్రామానికి చెందిన షేక్ రసూల్ బాషా కుమారుడైన రాహుల్(23)గా పోలీసులు గుర్తించారు. కొల్లూరు- తెనాలి ప్రధాన రహదారిపై తెనాలి వైపునకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొట్టాడు. దీంతో మెదడుకు తీవ్రంగా దెబ్బ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు, మరో స్లిప్‌ను వేమూరు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. అతనిపై రేపల్లె ప్రాంతంలో 10 చోరీ కేసులు, తెలంగాణాలోని మేడ్చల్ ప్రాంతంలో 7కేసులు, గుంటూరు రూరల్ ప్రాంతంలో 1, తెనాలి ప్రాంతంలో 1కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా సేకరించిన సమాచారాన్ని ప్రకాశం జిల్లా పోలీసులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

బయోలపై విజిలెన్స్ కన్నెర్ర

- రూ.6.10 లక్షల విలువైన నకిలీ మందులు పట్టివేత



బయో స్టిమ్యులెంట్స్ స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8: గడచిన రెండు నెలల వ్యవధిలో జరిపిన దాడుల్లో అధిక మొత్తంలో నకిలీబయో మందులను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు గురువారం మరో గుట్టురట్టు చేశారు. నగరంలోని ఏటుకూరు రోడ్డులో వున్న కమ్మ శేషయ్య గ్రౌండ్‌లో ఎలాంటి అనుమతి లేకుండా నిల్వవుంచిన బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ గోడౌన్‌లో అక్రమంగా నిల్వవుంచిన 350 లీటర్ల బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటికి జీ2 అనుమతులులేవని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తరలించటానికి సిద్ధంగా ఉన్న బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బయోల విలువ రూ.6.10 లక్షల వరకు ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈదాడుల్లో విజిలెన్స్ ఏవో కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏవో బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

బడ్జెట్‌లో పన్నుల బాదుడే..

- మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత అని, ఖర్చులు పిసరంత అని, రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నులు బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలేమి లేవని, ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లని, మద్యం బాండ్లు రూ.16వేల కోట్లు అని, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు అని, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు అని, డిస్కం బకాయిలు రూ.27,284 కోట్లు అని, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రూ.95,400 కోట్లు అని వివరించారు. వైఎస్ఆర్ సీపీ హయాంలో రెట్టింపు అయిన ఏపీ అప్పులు, 2019లో టీడీపీ తీసుకున్న దాని కంటే నాలుగు రెట్లు అప్పు ఎక్కువ అని ఆయన వివరించారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఏపీని మార్చిన జగన్ అండ్ కో వైసీపీ హయాంలో తీసుకు వచ్చిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందని కొమ్మాలపాటి అన్నారు.



పాదయాత్రలో నాగమల్లేశ్వరరావు తదితరులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

- జాతీయ దోబీ మహా సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి8: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు మహా ఉద్యమాన్ని చేపడతామని జాతీయ దోబీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో తిరుపతి నుంచి విజయవాడకు పాదయాత్ర చేపట్టిన ఆయన గురువారం సాయంత్రం చుట్టుగుంట సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను చేపట్టిన పాదయాత్ర 19వ రోజుకు చేరిందని, ఇప్పటివరకు 452కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసినట్లు ఆయన తెలిపారు. 1950లో కేంద్రప్రభుత్వం గెజిట్లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్నే వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజకసంఘాల నేతలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో ఉద్యోగోన్నతులు

- గుంటూరు డీసీగా మహేశ్వర్‌రెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 8: దేవదాయ శాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూబుధవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జి డీసీగా ఉన్నా ఈ.చంద్రశేఖర్‌రెడ్డి హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఎండోమెంట్ ఏసీ బొంతు మహేశ్వర్ రెడ్డిని గుంటూరు రీజియన్ రెగ్యులర్ డీసీగా నియమించారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లా నెమలిలో ఉన్న ఆలయ ఏసీని డీసీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఈవోగా నియమించారు. ప్రకాశం జిల్లా సింగరకొండ నరసింహస్వామి దేవస్థానం ఈవోగావున్న కేబీ శ్రీనివాసరావుకు డీసీగా పదోన్నతినిస్తూ అదే ఆలయంలో కొనసాగాలని ఆదేశించారు. పొన్నూరు భవన్నారాయణ స్వామి దేవస్థానం ఈవో రవణమ్మను శ్రీశైలం దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బదిలీ చేశారు.



సీఎం కాన్వాయ్ వెళ్లేటప్పుడు మందడం శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

ఐదేళ్ళుగా అబద్ధాల పాలనే..

- మూడు ముక్కల ఆటతో ఇప్పటికే 20 సంవత్సరాలు వెనక్కి
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం జగన్‌రెడ్డి
- 1514 రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు ఫిబ్రవరి 8: పోలవరం పూర్తి చేస్తాం.. అమరావతిని బ్రహ్మాండంగా కడతాం.. మద్యాన్ని నిషేధిస్తామని సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్లుగా అబద్దాలతో పాలన చేస్తున్నాడని రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళలు గురువారం నాటికి 1514వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ.. అమరావతిని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, 20 సంవత్సరాలు వెనకబాటుతనానికి సీఎం జగన్‌రెడ్డి గురి చేశాడన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగింపుతో లక్షల కోట్లు సంపద రాష్ట్రానికి వచ్చేదన్నారు. మూడుముక్కల ఆటతో అది కూడ లేకుండా చేశాడన్నారు. అసెంబ్లీ సమావేశాల చివరిరోజు సీఎం జగన్ కాన్వాయ్ మందడం ధర్నా శిబిరం మీదుగా వెళుతున్న సమయంలో రైతులు బైబై సీఎం అంటూ నినాదాలు చేశారు. ధర్నా శిబిరం నుంచి రైతులు బయటకు రాకుండా పోలీసులు భారీగా మోహరించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి జై అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

1,41,466 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,41,193 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,466 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 93,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	10000	18000
273	9500	21500
341	9500	21500
4884	9000	19500
సూపర్ 10	12000	18000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	21500
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు

తెలుగుదేశం గెలుపే ధ్యేయం : వేగేశన

బాపట్ల, ఫిబ్రవరి 8: తెలుగుదేశం గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని ము త్తాయపాలెం గ్రామపంచాయతీ పల్లెపాలెంలో గురువారం ఇంటింటికి తెలుగుదేశం, మీమాట-నాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి టీడీపీ, జనసేన మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించి చీరలు, సంచులు, కరపత్రాలు అందజేసి ఆశీర్వదించమని కోరారు. పల్లెపాలెం గ్రామస్థు లకు కష్టం వస్తే తోడుగా ఉంటానని చెప్పారు. ఒక్కసారి టీడీపీని గెలిపించండి గ్రామాన్ని అన్ని విధాలాభివృద్ధి చేస్తానని తెలిపారు. తల్లికి వందనం, ఆడబిడ్డనిధి, దీపం పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేకూరుతుందన్నా రు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, మునీశ్వరరావు, దండమూడి సంధ్యారాణి, రమాదేవి, తెలుగుదేశం, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కర్లపాలెం, ఫిబ్రవరి 8: మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలోని బత్తులవారిపాలెంకు చెందిన ముగ్గురు వైసీపీ కార్యకర్తలు గురువారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నాయకులు బత్తుల సీతారామయ్య, ఊసా రాంబాబు, నక్కల నాగగోపిలకు నరేంద్రవర్మ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, పమిడి రవీంద్ర, బోయన వెంకటస్వామి, మద్దిబోయన నాగరాజు, పమిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి : డీవీఈవో

బాపట్లటౌన్, ఫిబ్రవరి 8: విద్యార్థుల ప్రాక్టికల్ మార్కులను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని డీవీఈవో పి.ఎర్రయ్య అన్నారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి న ఇన్విజిలేటర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 20 వరకు ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజి సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 62 ప్రాక్టికల్ కేంద్రాల్లో 7262 మంది జనరల్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9నుంచి 12 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు రెండుపూటలా ప్రాక్టికల్ పరీక్షలు అయా కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ట్యూషన్‌ఫీజు చెల్లించలేదని విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు నిరాకరిస్తే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తాత్కాల్ పథకం ద్వారా ఈనెల 10వ తేదీ వరకు పరీక్ష ఫీజును చెల్లించవచ్చునని ఈ అవకాశాన్ని రెగ్యులర్ ప్రైవేట్ విద్యార్థులంతా సద్వినియోగించుకునే విధంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు ఎస్పీ సన్మానం

బాపట్ల, ఫిబ్రవరి 8: శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులు కీలకపాత్ర పోషించారని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న ఆర్మ్‌డ్ రిజర్వు అధికారులకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏఆర్‌డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఆర్‌ఐలు ఎల్.మన్మధరావు, బి.శ్రీకాంత్‌నాయక్, ఎల్.గోపినాధ్, ఆర్‌ఎస్‌ఐలు సీజే భరత్, ఎన్.గోపిలు వివిధ జిల్లాలకు బదిలీపై వెళుతున్నట్లు ఎస్పీ తెలిపారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో ఏఆర్ సిబ్బంది ఉండటానికి, విధులు నిర్వహించటానికి, సాధన చేయడానికి సరైన సదుపాయాలు లేవని, సిబ్బంది సమస్యలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన ఏఆర్‌ఎంటీ కార్యాలయాలు, డాగ్‌కెన్నెల్, గార్డ్‌రూమ్, వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పోలీసు అధికారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ టి.వెంకటేశులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వి.మల్లికార్జున, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సింగయ్య, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో ఎస్పీ వకుల్ జిందాల్

వ్యాపారులు పోర్టల్‌లో నమోదు చేయాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీధర్

బాపట్ల, ఫిబ్రవరి 8 : జిల్లాలోని బియ్యం వ్యాపారులు, చిల్లర వర్తకులు, పెద్ద రిటైలర్లు, ప్రాసెసర్లు, రైస్‌మిల్లర్లు తమ వద్ద ఉన్న బియ్యం, ధాన్యం వివరాలను ప్రభుత్వం పోర్టల్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరు తమ వద్ద ఉన్న బియ్యం, నూకలు, బాసుమతి, తెల్లబియ్యం, పారాబాయిల్డ్ రైస్, బాసుమతి బియ్యం నిల్వల వివరాలను ప్రతి శుక్రవారం ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయానికి సంబంధించి అధికారులు తనిఖీ చేసే సమయంలో ఉల్లంఘించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

● ఆందోళనకారుల అరెస్టు సిగ్గుచేటు

● సీఐటీయూ నాయకులు

బాపట్ల, ఫిబ్రవరి 8: ఆశావర్కర్లకు కనీసవేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ పిలుపులో భాగంగా విజయవాడ బయలుదేరిన కొంతమంది ఆశావర్కర్లను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆశావర్కర్లు జీబీసీ రోడ్డుపై రాస్తారోకో చేశారు. పోలీసులు అక్రమ అరెస్టు చేయటం దారుణమని వారు పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు మానుకొని అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపెట్టున నినాదాలు చేశా రు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు కె.శరత్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వ సెలవులు, వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలన్నారు. సంబంధంలేని పనులు చేయించరాదన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నా రు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు వెంకటేశ్వరమ్మ, మహలక్ష్మీ, స్వాతి, లక్ష్మీ, వాణి తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో జీబీసీ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

● బాపట్లరూరల్, ఫిబ్రవరి 8 : ఆశావర్కర్లు చేపట్టిన న్యాయపరమైన డిమాండ్ల కోసం విజయవాడకు వెళ్ళనీయకుండా పోలీసులు అడ్డుపడటతో విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్ళనీయకుండా పోలీసులు ఆశావర్కర్లను నిర్బంధించటం బాపట్ల పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో రూరల్ పోలీసులు మండలంలోని ఆశావర్కర్లను పోలీసుస్టేషన్‌కు తరలించి నిర్బంధించారు.

● కొల్లూరు, ఫిబ్రవరి 8: ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులను పోలీసులు నిర్బంధించారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి తరలి వెళుతున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఆశాల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు తమను అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమని సీఐటీయూ నాయకుడు బి.సుబ్బారావు అన్నారు. వారి నుంచి సంతకాలు తీసుకుని పోలీసులు విడిచిపెట్టారు.



చుండూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశా వర్కర్లు

● చుండూరు, ఫిబ్రవరి 8: మండలంలోని ఆశా వర్కర్ల నాయకులను గురువారం చుండూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ కనీస వేతనాలు ఇవ్వాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు జరపాలంటూ తమ కోర్కెల సాధన కోసం ఛలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వారిని అదుపులోకి తీసుకున్నారు.

● రేపల్లె, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో ఎప్పుడు లేని విధంగా ఆశా వర్కర్లను అక్రమంగా జగన్ ప్రభుత్వం అరెస్టు చెయ్యటం సిగ్గుచేటని బాపట్ల జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. గురువారం సమస్యలను పరిష్కరించాలని అడిగిన ఆశావర్కర్లు అక్రమ అరెస్టులను నిరసిస్తూ బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నిర్బంధాన్ని ప్రయోగించే ఈ ప్రభుత్వానికి ఇంటిదోవ తప్పదని అన్నారు. ఇళ్ళ నుంచి బలవంతంగా ఆశా వర్కర్లను పోలీస్‌స్టేషన్లకు తీసుకువచ్చి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మండలంలోని బేతపూడి, రేపల్లె టౌన్, గుడ్డికాయలంక, చాట్రగడ్డకు చెందిన ఆశా వర్కర్లును పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం 2గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ దానమ్మ, కరిమున్నీసా, దేవి, కె.ఆశీర్వాదం, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

కేంద్ర, రాష్ట్రాల్లో కుంటుపడిన అభివృద్ధి

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు

బాపట్ల, ఫిబ్రవరి 8 : కేంద్ర, రాష్ట్రంలో అభివృద్ధి పూర్తి స్థాయిలో కుంటుపడిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు విమర్శించారు. బాపట్లలో బుధవారం సాయంత్రం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి రోడ్‌షో విజయవంతం కావటంతో పార్టీశ్రేణులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు షర్మిలతోనే సాధ్యమన్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ ఫోటో కూడా వేయలేని పరిస్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రతి జెండాపై వైఎస్ ఫొటో ఉంటుందన్నారు. రాష్ట్రంలో జగన్ ట్యాక్స్, బాపట్లలో కోన ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. షర్మిల రోడ్‌షోకు బాపట్ల జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. దీనికి సహకరించిన జిల్లాలోని అన్ని నియో జకవర్గాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం లో రాష్ట్ర అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వరరావు, జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలకు పెయింటింగ్ అందజేత

బాపట్ల, ఫిబ్రవరి 8: పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి రాష్ట్రంలో పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్న వైఎస్ షర్మిలరెడ్డి పె యింటింగ్‌ను బాపట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు ముఖ్యనాయకులతో కలిసి గురువారం ఆమెకు అందజేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస చేసిన ఆమెను కలిసి పెయింటింగ్ అందజేశారు. కేంద్రమాజీ మంత్రి జేడీ శీలం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, గంటా నవీన్ తదితర నాయకులున్నారు.



షర్మిలరెడ్డి పెయింటింగ్‌ను అందజేస్తున్న దేవరాజు తదితరులు

వార్డుల్లో పర్యటించిన కమిషనర్ రామచంద్రారెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని 10వవార్డు ప్యాడిసన్‌పేటలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి సిబ్బందితో కలిసి గురువారం పర్యటించారు. వార్డులో పారిశుధ్య పనులు పరిశీలించి డ్రైనేజీలలో వ్యర్థాలు తొలగించి చెత్త నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచే విధంగా కార్మికుల ద్వారా పనిచేయించాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా మరికొన్ని వార్డుల్లో పర్యటించా రు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

బాపట్ల, ఫిబ్రవరి 8: డిసెంబరు నెలలో సంభవించిన తుఫాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల వారికి భారత అభ్యుదయ సేవాసమితి, గుంటూరువారు గురువారం కొండుబొట్లవారిపాలెం నల్లమడ డ్రైన్ కట్టపై నివాసం ఉంటున్న 100 కుటుంబాల వారికి నిత్యావసరాలు, దుప్పట్లు, టార్పాలిన్ పట్టాలను అందించారు. అదేవిధంగా రేపల్లె, సూర్యలంక, రామాపురం, పల్లెకోనలో కూడా 200 కుటుంబాలవారికి నిత్యావసర కిట్లు అందజేసినట్లు సంస్థ చీఫ్ కోఆర్డినేటర్ చుక్కా జోసఫ్ అంథోను తెలిపారు. కార్యక్రమంలో మర్రి పాలనాగరాజు, కిషోర్, కాకుమాను రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు, బిస్కెట్లు...

బాపట్ల, ఫిబ్రవరి 8: మండలంలోని వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మానస ప్రియదర్శిణి, డాక్టర్ వైష్ణవికృష్ణ, సిబ్బంది డి.ప్రసాద్, పి.పద్మ, జి.రెబకా తదితరులు పాల్గొని గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉయ్యాల శివకామేశ్వరి, వెంకటేశ్వర్లు, వెదుళ్ళపల్లి, బేతపూడి, కావూరివారిపాలెం, స్టూవర్టుపురం గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు దుప్పట్లు...

కర్లపాలెం, ఫిబ్రవరి 8 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పెన్షన్‌దారులకు కోనచారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, ప్రముఖ సినీరచయిత కోన వెంకట్‌లు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సీతారామిరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, మండపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

14న యానాదుల శంఖారావం

కర్లపాలెం, ఫిబ్రవరి 8: యానాదుల రాష్ట్ర మహాసభ ఈనెల 14వ తేదీన జరగనున్నదని యానాదసంఘాల మహాకూటమి రాష్ట్రాధ్యక్షుడు బాపట్ల వెంకటపతి అన్నారు. కర్లపాలెంలోని వాసవి ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో గురువారం యానాది సంఘనేతలతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈగా శ్రీనివాసరావు, ఏకసిరి నరసింహారావు, వెల్లంచర్ల ప్రసాద్, రావూరి శ్రీనివాసరావు, తుమ్మా కొండలు, గోసాని తిరుపతమ్మ, గోసాని రాంబాబు, జి.అరుణ, జీవన్‌బాబు, కోనేటి సుందరమ్మ, తలపల జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా

● విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి ప్రసాదరావు



లోకేశ్‌తో దగ్గుమళ్ళ ప్రసాదరావు

బాపట్ల, ఫిబ్రవరి 8 : బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పిస్తే నియోజకవర్గ పరిధిలో పరిశ్రమలు తీసుకొచ్చి ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కోరారు. బాపట్ల ఎంపీ టిక్కెట్టు ఆశిస్తున్న ఆయన నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బాపట్ల రాజకీయాలపై చర్చించారు. తనకు అవకాశం ఇస్తే దేశ, విదేశాల్లో ఉన్న తన బ్యాచ్‌మెట్స్, స్నేహితులతో కలిసి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానికుడినైన తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం తీరం వెంట ఉంది కావున తీర ప్రాంతంలో మత్స్యకారుల సంక్షేమానికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి రైతుల సంక్షేమానికి కావాల్సిన వనరులు తీసుకొస్తానన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేయరాదు : రంగారావు

బాపట్ల, ఫిబ్రవరి 8: ఆటోడ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయరాదని పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించరాదని మోటారు వాహనాల తనిఖీ అధికారి డీవీ రంగారావు తెలిపారు. 35వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌టెస్టింగ్ ట్రాక్ నందు ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రంగారావు మాట్లాడుతూ మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. అనంతరం డ్రైవర్‌లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ప్రసన్న కుమారి, పి.అంకమ్మరావు, బి.కిషోర్‌బాబు పాల్గొన్నారు.



డ్రైవర్‌లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటారు వాహనాల తనిఖీ అధికారి రంగారావు

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగు లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసి డిపో నుంచి కొత్తబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవ ర్యాలీ

కర్లపాలెం, ఫిబ్రవరి 8 : జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవ ర్యాలీని మండలపరిషత్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, విద్యార్థులతో నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎం.గోపినాధ్, డీఐవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నేతాజి, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, సీహెచ్‌వో మేరీ, ప్రభావతి, సూపర్ ఇస్సాకు, కిషోర్, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హత్య కేసులో మరో ముగ్గురి అరెస్టు

బాపట్లరూరల్, ఫిబ్రవరి 8 : బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని పందెంకోడి రెస్టారెంట్ సమీపంలో ఈనెల 6వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసులో మరో ముగ్గురు నిందితులను గురువారం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ముగ్గురు నిందితులను సంఘటన జరిగిన రోజు అదుపులోకి తీసుకోగా చిన్న వినోద్, ప్రవీణ్, అఖిల్‌లను అదుపులోకి తీసుకున్నామని మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

బాపట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని శారదాపురి కాలనీకి చెందిన ఖగ్గా హైమావతితో అదే ప్రాంతానికి చెందిన నంగనం నరసింహారావు అసభ్యంగా ప్రవర్తించి చేయిపట్టుకొని లాగాడని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. హైమావతి ఇళ్ళల్లో పనిచేసుకొని జీవిస్తుండగా ఆమె చేయి పట్టుకొని లాగినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

బాపట్ల, ఫిబ్రవరి 8 : పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్‌కు చెందిన దోపాటి వెంకటేశ్వరరావు చీలురోడ్డు నుంచి ఇంటికెళుతుండగా తాడిశెట్టి జ్ఞానేందర్, ప్రభుదాసులు ఏమిటిరా ఇక్కడ మద్యం తాగుతున్నావని అడగ్గా తాను తాగటంలేదని చెప్పటంతో ఇద్దరు కలిసి దాడి చేసి కొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, ఫిబ్రవరి 8: మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు అన్నారు. గురువారం స్థానిక చంద్రమౌళి పార్కులో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు రూ.21,500 వేతనం చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రవిబాబు, గౌరవాధ్యక్షుడు మణిలాల్, కోశాధికారి కె.రాఘవేంద్రరావు, బి.యువరాజ్, వి.శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

అరాచకపాలనను తరిమికొట్టేందుకు సిద్ధం కావాలి

నగరం, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని టీడీపీ నగ రం మండల అధ్యక్షుడు చింతల సుబ్బారావు అన్నారు. గురువారం మండలంలోని పెదమట్లపూడి గ్రామంలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా భవిష్యత్తు తరాల బాగుండాలన్నా రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలంతా చంద్రబాబుకు, అనగానికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, మాజీ జడ్పీటీసీ మేకా శివరామకృష్ణ, అధికార ప్రతినిధి పీవీ చింతారావు, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, లుక్కా గుడారంకయ్య, షేక్ మున్నాఫ్, తాతా ఏడుకొండలు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, చలమయ్య, నున్నా జయరావు, తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 8: పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పీఆర్ డిఈ వి.సాయి కిషోర్ తెలియజేశారు. మండలంలోని వెల్లటూరు పీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మిస్తున్న భవనాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ నిధులు రూ.50 లక్షలతో వెల్లటూరు పీహెచ్‌సీలో యూనిట్‌ను నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున యూనిట్ బ్లాక్‌లను కేటాయించారని తెలియజేశారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన

భట్టిప్రోలు, ఫిబ్రవరి 8: విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో -2 ఎన్ దేవరాజ్ అన్నారు. ఎస్ఎఫ్ ఐ, అంబేద్కర్‌యూత్ ఆధ్వర్యంలో అద్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హవీల ప్రశాంతి, ఉపాధ్యాయులు సునీ త, భువనేశ్వరి, విజయలక్ష్మీ, రత్నాకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్‌కుమార్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



ఆసరా చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున తదితరులు

కొల్లూరు, ఫిబ్రవరి 8 : డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున పంపిణీ చేశారు. కొల్లూరులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొల్లూరు మండలంలో 1215 డ్వాక్రా సంఘాలకు సంబంధించి 13 కోట్ల 8 లక్షల 33 వేల 10 రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు. మంత్రితో పాటు ఇన్ చార్జి వరికూటి అశోక్‌బాబు చేసిన ప్రసంగం ప్రతిపక్ష నేత చంద్రబాబును విమర్శించడంతో పాటు వైసీపీకి ఓటు వేసి 175 సీట్లు గెలిపించాలంటూ మహిళలను ఉద్దేశించి ప్రసంగించడంతో ప్రభుత్వ కార్యక్రమం కాస్త ఎన్నికల ప్రచారంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, ఎంపీడీవో లక్ష్మీకుమారి, ఏఎంసీ చైర్మన్ ఉప్పు శిరీష, జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, మండల స్థాయి అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేషన్ వైద్యం

వేమూరు, ఫిబ్రవరి 8 : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నూతన సంస్కరణలతో ప్రజాహిత పాలన కొనసాగిస్తున్నారని అందులో భాగంగా వైద్య విద్యారంగంలో పెను మార్పులు తీసుకు వచ్చారని రాష్ట్ర సాంఘీక, సంక్షేమశాఖ మంత్రి మెరుగు నాగార్జున తెలిపారు. గురువారం వేమూరులో నాబార్డు నిధులు రూ.8.60కోట్ల తో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనాలను మంత్రి చేతు ల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ధనుంజయ స్వాగతం పలికారు. మెడికల్ హెల్త్ సెంటర్ అధికారిని డాక్టర్ డీవీకే హరిణి నివేదిక సమర్పించారు జడ్పీటీసీ గాజుల హేమలత, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఉడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, జిల్లా వైద్యాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సాధికారతపై ప్రశ్నిస్తున్న ఎస్సీ, ఎస్టీలు

వేమూరు, ఫిబ్రవరి 8: నాబార్డు నిధులు రూ.860లక్షలతో వేమూరులో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాల భవనాలను, శిలాఫలకాన్ని ప్రారంభించారు. అయితే శిలాఫలకంపై ప్రారంభకులు విశిష్ట అతిథులు, ముఖ్య అతిథులు, గౌరవ అతిథులు అంటూ నాలుగు విభాగాలుగా పేర్లు వేశారు. వాటిలో ఎక్కడ సామాజిక సాధికారత కనబడలేదు. ఎందుకంటే ప్రజలతో ఎన్నుకోబడిన ఇద్దరు ఎంపీటీసీ మహిళల పేర్లు ఫలకంపై వేయలేదు. వారిద్దరూ ప్రజాప్రతినిధులు కావడంతో పాటు మహిళా విభాగానికి చెందిన ఎస్సీ మహిళ ఒకరైతే మరొకరు ఎస్టీ మహిళ వీరిద్దరి పేర్లు బోర్డుపై లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ వర్గాన్ని అవమానించారంటూ ఆ రెండు సామాజిక కులాలకు చెందిన వారువిమర్శిస్తున్నారు.

భట్టిప్రోలు తహసీల్దార్‌గా పద్మావతి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 8: మండల తహసీల్దార్‌గా సీహెచ్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలో పని చేస్తూ ఎన్నికల బదిలీపై భట్టిప్రోలుకు వచ్చారు. విధుల్లో చేరిన పద్మావతికి ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్‌వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది, డీలర్లు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం సుభద్ర బల్లికురవ కు బదిలీపై వెళ్ళారు.

వెంకటేశ్వర్లు మృతికి ఆనందబాబు సంతాపం

చుండూరు ఫిబ్రవరి 8: పార్టీ కార్యకర్త ప్రమాదంలో మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బుధవారం రాత్రి మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి కుటుంబాన్ని పరామర్శించారు. మండలంలోని చినపరిమికి చెందిన తెలుగుదేశం కార్యకర్త, తెనాలి మున్సిపాలిటీలో దినసరి కూలీగా పని చేసుకుంటున్న వెంకటేశ్వర్లు (50)బుధవారం మధ్యాహ్నం పట్టణంలో వాటర్ వర్క్స్ జరుగుతుండగా పని స్థలంలోనే మృతి చెందాడు. ఆనందబాబు గ్రామానికి వచ్చి ఆ కుటుంబాన్ని ఓదార్చి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు తమ్మా శివారెడ్డి, మోహన్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, జాన్, చందోలు వాసు, తదితరులు పాల్గొన్నారు.

వరి గడ్డి దగ్ధం

కొల్లూరు, ఫిబ్రవరి 8 : వరిగడ్డి చుట్టలు దగ్ధమైన ఘటన గురువారం సాయంత్రం జరిగింది. కొల్లూరులోని ఓ ఖాళీ స్థలంలో పశుగ్రా సం కోసం ఉంచిన ఎకరం వరి గడ్డి చుట్టలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి తమ ఇళ్లలోని మోటార్ల ద్వారా ట్యూబుల సహాయంతో మంటలను అదుపు చేశారు. దాసరి బసవయ్యకు చెందిన వరి గడ్డి చుట్టలుగా చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

వైసీపీలో గందరగోళం

- ఎమ్మెల్యే మహీధర్‌కు నో టికెట్
- తాడేపల్లికి పిల్చి చెప్పిన సీఎం జగన్
- పోటీ చేయలేనని తేల్చిన మాజీ ఎమ్మెల్యే
- మహీధరరెడ్డి స్థానంలో బీసీ మహిళ
- పర్చూరులో అభ్యర్థి కోసం కొనసాగుతున్న అన్వేషణ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో సీనియర్ ఎమ్మెల్యేకు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి షాకిచ్చారు. అదే సమయంలో జగన్ ఏరికోరి తెచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి ఇచ్చిన షాక్ నుంచి ఆ పార్టీ ఇంకా తేరుకోలేదు. అదే సమయంలో ఇప్పటికే ఎమ్మెల్యేలను అటుఇటు బదిలీలు చేసిన నియోజకవర్గాల్లో వైసీపీ పరిస్థితులు ఏ మాత్రం కుదుటపడలేదు. దీనికితోడు రానున్న రోజుల్లో అధికార వైసీపీకి మరికొన్ని షాక్‌లు తగిలే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ముందు నుంచి ఊహిస్తున్నట్లే కందుకూరు స్థానం నుంచి సీనియర్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని సీఎం జగన్ తప్పించి వేశారు. ఆయన స్థానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన మహిళను రంగంలోకి తేనున్నారు. ఆ మేరకు గురువారం మహీధర్‌రెడ్డిని పిలిపించుకుని 'మీకు ఈసారి టికెట్ లేదు. కందుకూరు నుంచి బీసీ మహిళను రంగంలోకి దింపబోతున్నాం. మీరు సహకరించి గెలిపించండి' అంటూ తేల్చిచెప్పేశారు. అప్పటికే ఆయన వద్ద ఉన్న గూడూరుకు చెందిన ఆదిశంకర ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మన్ పెంచలయ్యను ఆయనతోపాటు ఉన్న ఆయన ఇద్దరు కుమార్తెలను పరిచయం చేశారు. అంతకుముందే పెంచలయ్యను పార్టీలో చేర్చుకుని వైసీపీ కండువా మెడలో వేశారు. నెల్లూరుకు చెందిన మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్ పెంచలయ్యను సీఎంకు పరిచయం చేసి పార్టీలో చేరతాడని అవకాశం ఇస్తే ఆయన లేక ఆయన కుమార్తెలలో ఒకరు కందుకూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉంటారని చెప్పారు. చర్చల అనంతరం జగన్ వారికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. పెంచలయ్యతోపాటు ఆయన కుమార్తె అరవింద, మూడవ కుమార్తె డాక్టరు వి.ఐశ్వర్యలు జగన్‌ను కలిశారు. తాను లేకుంటే తన కుమార్తెల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలిసింది. మహిళా అభ్యర్థిని రంగంలో దింపాలని భావిస్తున్నామని మీ కుమార్తెలు అరవింద, ఐశ్వర్యలలో ఒకరిని మీరే ఎంపిక చేసుకుని రంగంలో దింపాలని జగన్ సూచించినట్లు తెలిసింది. ఆ తర్వాత మహీధరరెడ్డిని కూడా పిలిచి విషయం సూటిగా చెప్పేశారు. పెంచలయ్య కుమార్తెల్లో అరవిందకు వివాహం కాగా ఐశ్వర్యకు ఇంకా వివాహం కాలేదు. దీంతో అరవింద కుటుంబసభ్యులు అంగీకరిస్తే ఆమెను కానిపక్షంలో ఐశ్వర్యను రంగంలో దింపుతానని పెంచలయ్య చెప్పినట్లు తెలిసింది.

మహీధర్‌రెడ్డి దారెటు?

గతంలో ఒకసారి సీఎంను కలిసిన సందర్భంలో మహీధరరెడ్డి తనకు అవకాశం ఇవ్వాలా వేరొకరిని రంగంలోకి దించాలనేది మీ ఇష్టమని, మీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పినట్లు సమాచారం. నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేస్తారని భావించిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి కందుకూరు మహీధరరెడ్డికే ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో మహీధరరెడ్డికి అవకాశం వస్తుందని భావించారు. తాజా పరిణామాల్లో నెల్లూరు సిటీ స్థానం నుంచి తాను సూచించిన వారికి కాకుండా వేరేవారికి అవకాశం ఇవ్వటంతోపాటు ఆ విషయాన్ని తనకు కూడా చెప్పకపోవటంతో వేమిరెడ్డి అలకబూనారు. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయలేనని చెప్పినట్లు తెలిసింది. తన రాజకీయ భవితవ్యంపై మహీధరరెడ్డి ఏ నిర్ణయం తీసుకుంటారనేందుకు వేచిచూడాల్సిందే. విషయం తెలిసిన కందుకూరు నియోజకవర్గంలోని ఆయన అభిమానులు కొందరు మహీధర్‌రెడ్డికి ఫోన్‌చేయగా అందుబాటులో లేడని తెలుస్తోంది.

పర్చూరుపై ఆమంచి హ్యాండ్సప్

మరోవైపు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పర్చూరు నుంచి పోటీ చేయకూడదన్న ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఆమేరకు ఐప్యాక్ ప్రతినిధులకు ఆయన సమాచారం ఇచ్చినట్లు కూడా తెలిసింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే పర్చూరుకు మరో అభ్యర్థికోసం అధిష్ఠానం వెతుకులాట చేపట్టింది. నియోజకవర్గానికి చెందిన గొట్టిపాటి భరత్‌ను పిలిచి ఇప్పటికే జగన్ మాట్లాడి ఉన్నారు. అలాగే దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్, ఒంగోలుకు చెందిన వ్యాపారి కంది రవిశంకర్‌లను కూడా పర్చూరు నుంచి పోటీచేయాలని అధిష్ఠానంలోని నాయకులు సూచించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి, వ్యాపారి రవిశంకర్‌ల నుంచి సానుకూలత వ్యక్తం కాలేదని సమాచారం. మంత్రి బొత్స ద్వారా పర్చూరుకు చెందిన ఎన్నారై రామాంజనేయులు అవకాశం ఇస్తే పోటీకి సిద్ధమని సమాచారం పంపినట్లు తెలుస్తోంది. సీఎం జగన్ సూచనల మేరకు కాపు సామాజికవర్గం వారినే రంగంలో దించే ఉద్దేశంతో అధిష్ఠానంలోని నాయకులు అన్వేషణ ప్రారంభించారు. సీఎం జగన్ ఢిల్లీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత పర్చూరు అభ్యర్థిపై ఓ నిర్ణయానికి రావచ్చని తెలుస్తోంది. ఆమంచి చీరాలలోని తన అనుచరులతో పదేపదే మంతనాలు జరుపుతూ ఉన్నారు. దీంతో ఆయన ఏరూపంలో ముందడుగు వేస్తారనే విషయంపై కూడా వైసీపీ అధిష్ఠానం దృష్టిసారించి ఉంది. ఈనెల 14 తర్వాత ఆమంచి తన నిర్ణయాన్ని బహిరంగపరిచే అవకాశం కనిపిస్తోంది. దీంతో చీరాల, పర్చూరు నియోజకవర్గాల వైసీపీలో కూడా కొన్ని మార్పులు జరిగే అవకాశం కనిపిస్తుండగా శ్రేణుల్లో అలజడి తీవ్రమైంది.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

అద్దంకి, ఫిబ్రవరి 8: రోడ్డు భద్రతా నియమాలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆర్టీసీ అద్దంకి డిపో అస్టెంట్ మేనేజర్ మహబూబి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, విద్యార్థులు బస్టాండ్ వద్ద నుండి అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఏడుకొండలు, నాగేశ్వరరావు, తిరుపతిరెడ్డి, తిమ్మాయపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

11న విద్యోన్నతి ఫౌండేషన్ పరీక్ష

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 8: విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్కాలర్‌షిప్ ఎంపికకై నైపుణ్యత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ తెలిపారు. గురువారం స్థానిక పట్టణ అభివృద్ధి కమిటీ కార్యాలయంలో పరీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో సంవత్సరానికి రూ.10 వేల చొప్పున 15 మందికి ఇస్తామన్నారు. అద్దంకి మండలంలో 11 ఉన్నత పాఠశాలలు, ఇంకొల్లు మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు, పంగులూరు మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు, మొత్తం 24 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కై దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ఆరోజు ఉదయం 9 గంటలకు పరీక్ష సెంటర్‌కు రావాలని తెలిపారు. కార్యక్రమంలో బుద్దిష్ట్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్ళూరు బాబురావు, హెచ్ఎం గంగాధర్, అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు అందజేత

ఇంకొల్లు, ఫిబ్రవరి 8: ఇంకొల్లు మండలంలో 1028 గ్రూపులకు నాలుగో విడత ఆసరా నగదు చెక్కు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా హాజరై రూ.9 కోట్ల 71లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మోహన్, ఆచారి, శ్రీదేవి, బండారు అనూష పాల్గొన్నారు.

కాకాని హనుమంతరావుకు నివాళి



హనుమంతరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 8: ప్రముఖ వ్యాపారి కాకాని హనుమంతరావుకు పలువురు నివాళులర్పించారు. పట్టణంలోని కాకానిపాలెంలో హనుమంతరావు దశదిన కర్మ జరిగింది. అద్దంకి, చీరాల ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవికుమార్, కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య, తదితరులు కాకాని చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు.

రాఘవరావుకు నివాళులర్పించిన టీడీపీ నేతలు

చినగంజాం, ఫిబ్రవరి 8: మండలంలోని కడవకుదురు గ్రామానికి తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు అనంత రాఘవరావు దశదిన కర్మకు గురువారం టీడీపీ మండల నాయకులు హాజరై నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మృతి చెందాడు. గ్రామంలో రాఘవరావు స్వగృహం వద్ద జరిగిన దశదిన కర్మ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, టీడీపీ బాపట్ల పార్లమెంట్ యాదవ సాధికార కమిటీ కన్వీనర్ నక్కల వీరరాఘవులు, న్యాయవాది కోటిక ఉదయభాస్కరరావు, చినగంజాం, కారంచేడు మండలాల ప్రధాన కార్యదర్శులు అబ్దుల్‌కలాం ఆజాద్, షేక్ ఖాసీం, నాయకులు వడ్లమూడి సత్యనారామణ, కె.విష్ణు, దండుప్రోలు తిరుపతిరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను నిర్బంధించడం దుర్మార్గం

చినగంజాం, ఫిబ్రవరి 8: ఆశా కార్యకర్తలను నిర్బంధించి వారి హక్కులను కాలరాయడం దుర్మార్గపు చర్యని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకపోగా పోలీసులను అడ్డు పెట్టి నిర్బంధాలకు గురుచేయడం సరైంది కాదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసి కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే పోరాటల ద్వారానే పరిష్కరించుకోవాల్సి వస్తుందని ప్రతాప్‌కుమార్ హెచ్చరించారు.

సాగర్ నీటి సరఫరాలో నిర్లక్ష్యం

- బడ్జెట్‌లో అంచనాలు కొండంత..
- రెట్టింపు అయిన అప్పులు
- గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యల ప్రస్తావనే లేకపోవటం బాధాకరం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 8: సాగర్ నీటి సరఫరా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పట్ల జగన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందని అన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదలచేశారు. బడ్జెట్ ప్రసంగంలో అన్ని రంగాలలో రాష్ట్రం పురోగమిస్తుందని ప్రభుత్వం చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. బడ్జెట్ అంచనాలు కొండంత, ఖర్చులు పీసరంతగా ఉన్నాయన్నారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమి లేవని చెప్పారు.

వైసీపీ హయాంలో అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందన్నారు. ధరల పెంపు, పన్నులు మోయలేని భారంగా మారాయన్నారు. రైతుల ఆత్మహత్యలలో దేశంలో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర ఆదాయం పెరిగి, ఏపీ ఆదాయం తగ్గిందన్నారు. కేంద్రం నుంచివచ్చిన నిధులను దారి మళ్లించిందన్నారు.

సాగర్ ఆయకట్టు పరిధిలో లక్షలాది ఎకరాలు బీడులుగా వదిలేసి రైతులు కూలీలుగా మారారని ఎమ్మెల్యే రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగొండకు నీరు వస్తే పశ్చిమ ప్రకాశం జిల్లా నీటి ఎద్దడి తీరుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. అయితే, బడ్జెట్‌లో వెలుగొండ కు కేటాయింపులు తక్కువగా ఉండటంతో పూర్తిగా ప్రాజెక్టు మనుగడకే ముప్పు ఏర్పడిందన్నారు. వెలుగొండను పూర్తి చేయటంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు గ్రామాల సమస్యల ప్రస్తావనే లేకపోవటం బాధాకరమని రవికుమార్ పేర్కొన్నారు.

బడ్జెట్ కొండంత.. విడుదల పిసరంత

- అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన వైసీపీ ప్రభుత్వం
- ఎమ్మెల్యే ఏలూరి ధ్వజం



సాంబశివరావు

పర్చూరు, ఫిబ్రవరి 8: ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అంకెలను మసిపూసి మారేడుకాయ చేసి అంకెల గారడి చేశారని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదలచేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం గొప్పలు చెప్పేందుకు కొన్ని అంకెలు పెంచి చూపారన్నారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని చాటుకునేందుకు రెవెన్యూ లోటును తగ్గించి చూపారని ఏలూరి మండిపడ్డారు. చేసిన అప్పులను చెల్లించే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనుడు బుగ్గన అన్నారు. వైసీపీ ప్రభుత్వం 2019-20లో రూ.1.80 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని, 2024-25కి రూ.2.86 లక్షల కోట్లు దాటడం అసమర్థ ఆర్థిక నిర్వహణకు నిదర్శనమన్నారు.

అయిదేళ్లలో సగటు రెవెన్యూ ఆదాయం పెరిగినా, వైసీపీ ప్రభుత్వం చేతకాని తనం వల్ల రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు భారీగా పెరిగాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. వాస్తవ మూలధన వ్యయం తక్కువగా ఉందని, ఆస్తుల కల్పనే లేదని చెప్పారు. అప్పులపై వడ్డీ కట్టలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. కార్పొరేషన్‌ల రుణాలు పెరిగినా ఆదాయాలు లేవన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లు అన్నారు. మద్యం బాండ్లు రూ.16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు, డిస్కమ్ బకాయిలు రూ.27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న దానికంటే 4 రెట్ల అప్పు వైసీపీ చేసిందన్నారు. వైసీపీ హయాంలో అప్పుల భారం తప్ప మరీ ఏమీ లేదన్నారు. రిజిస్ట్రేషన్‌లు భారీగా పెంచిన జగన్ సర్కార్, విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా ఎక్కడా రాజీపడలేదన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలను ఏడుసార్లు పెంచి, సర్‌చార్జీల పేరుతో మరింతగా వడ్డింపు వడ్డించిందన్నారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. ఆరోగ్య శ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమేనన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సైకో ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న బోజనం రద్దుచేయటంతోపాటు, 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపిందన్నారు. రైతు ప్రభుత్వ అని గొప్పలు చెప్పుకుంటూ రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి రైతులను నిలువునా మోసం చేశారన్నారు. పేరుకే బీసీ సంక్షేమం అని సబ్‌ప్లాన్ నిధులు రూ.75వేల కోట్లు దారి మళ్లించి, 30 పథకాల రద్దు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడు మృతి

మార్టూరు , ఫిబ్రవరి 8: జాతీయ రహదారిపై మండలంలోని బొల్లపల్లి కాలువ సమీపంలో ద్విచక్రవాహనాన్ని వెనుకనుంచి కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులలో షేక్ నాగూర్ వలి అలియాస్ గాంధి(26) సంఘటనా స్థలంలో మృతి చెందాడు. మరో ఇద్దరు యువకులు ఎస్‌కే నసీర్, టి.హరీష్‌కు గాయాలయ్యాయి. ఈ ముగ్గురు జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన వారు. అందిన సమాచారం మేరకు.. ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై రామకూరు నుంచి మార్టూరులో సినిమా చూడడానికి వెళ్లేక్రమంలో సాగర్ కాలువ పక్కన రోడ్డు గుండా జాతీయ రహదారిపైకి వచ్చారు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి బొల్లపల్లి టోల్‌గేట్ దాటిన కారు వేగంగా వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో ముగ్గురు యువకులు రోడ్డుపై పడిపోయారు. వారిలో నాగర్ వలి తల రోడ్డు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నాగూర్ వలి తండ్రి గతంలోనే చనిపోగా, తల్లి దివ్యాంగురాలు. అతను గుంటూరులోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. గాయపడిన నసీర్ అనే యువకుడు ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారులో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం జగ్రపూరుకు చెందిన ఎన్.జయన్నారాయణ, కొండపి మండలం పోరిరెడ్డిపాలెంకు చెందిన కె.శివన్నారాయణ ప్రయాణిస్తున్నారు.

సమాచారం అందగానే ఏఎస్‌ఐ సైదా, బాషా సంఘటనాస్థలాన్ని పరిశీలించి 108లో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగూరువలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేసున్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు.. 71 కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

మేదరమెట్ల, ఫిబ్రవరి 8: విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు చేసి 71 కేసులు నమోదు చేసి రూ.5 లక్షల 84 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. కొరిశపాడు మండలంలోని 12 గ్రామాలలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఒకరు దొంగతనంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.లక్ష, 2 బాక్ బిల్లింగ్ కేసులకు రూ.లక్ష, అదనపు లోడు వాడుతున్న 64 సర్వీసులకు రూ.3 లక్షల నాలుగు వేలు, శాంక్షనేతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న నలుగురికి రూ.80 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు సత్యనారాయణ, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. తాగునీరు వృథా



కుళాయికి ట్యాప్ లేకపోవటంతో వృథాగా పోతున్న నీరు

అద్దంకి, ఫిబ్రవరి 8: చిన్నపాటి శ్రద్ధ వహిస్తే నీటి వృథాను అరికట్టే అవకాశం ఉన్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా పోతుందనే విమర్శలు వస్తున్నాయి. మండలంలోని చక్రాయపాలెంకు ధర్మవరం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా జరగాల్సి ఉండగా పథకం పూర్తిగా అటకెక్కింది. దీంతో ప్రత్యామ్నాయంగా చక్రాయపాలెం సమీపంలో గుండ్లకమ్మ నదిలో బావిని ఏర్పాటుచేసి అక్కడ నుంచి గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్నారు. ట్యాంక్ నుంచి నీటిని విడుదల చేసిన సమయంలో కుళాయిల నుంచి నీరు వృథాగా పోతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్యాప్‌లు మరమ్మతులకు గురైనచోట మరలా కొత్తవి ఏర్పాటు చేయకపోవటంతో నీరు వృథాగా పోతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

నగదు అపహరణ

అద్దంకి, ఫిబ్రవరి 8: కలెక్షన్ బాయ్ వద్ద బ్యాగ్‌ను దొంగ చోరీ చేశాడు. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని పాత గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్ని ప్రసాద్ దుకాణంలో గుమస్తాగా పనిచేసే గార్లపాటి శ్రీనివాసరావు గురువారం రాత్రి షాపుల వద్ద బకాయిల వసూలు కోసం భవానిసెంటర్‌లో ఓ దుకాణం వద్దకు వెళ్ళాడు. దుకాణం వ్యక్తి వద్ద నగదుకు సంబంధించి ఓచర్ పరిశీలిస్తుండగా వెనుక నుంచి నెత్తిన టోపి పెట్టుకున్న యువకుడు వచ్చి క్యాష్ బ్యాగ్‌ను లాక్కొని మోటార్‌సైకిల్‌పై దర్శి రోడ్డులో వెళ్ళిపోయాడు. వెంటనే కేకలు వేసినప్పటికి అప్పటికే అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. దుకాణంలో అమర్చిన సీసీ కెమెరాలలో చోరీకి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. క్యాష్ బ్యాగ్‌లో సుమారు రూ.20 వేలు ఉన్నాయి. ఇదే తరహాలో గత ఏడాది ఆయిల్ మిల్ రోడ్డు, ఎస్‌బీఐ రోడ్డులో కూడా కలెక్షన్ బాయ్స్ వద్ద క్యాష్ బాగ్‌ల చోరీలు జరిగాయి.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయిన కారు

అద్దంకి, ఫిబ్రవరి 8: కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ పొలాల్లోకి దూసుకుపోయింది. అందులో ఉన్న తల్లీ కొడుకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం మారెళ్లకు చెందిన చుండి విజయభాస్కరరెడ్డి అద్దంకిలో స్థిరపడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తల్లి సీతారావమ్మ(94)ను కారులో ఒంగోలులో వైద్యశాలలో పరీక్షలు చేయించుకొని తిరిగి అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం బలరామకృష్ణాపురం పునరావాసకాలనీ క్రాస్‌రోడ్డు సమీపంలో నామ్ రోడ్డుపై ఒక్కసారిగా కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు మార్జిన్‌లో గుండా పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెంటనే స్నేహితులకు సమాచారం ఇవ్వటంతో వేరొక వాహనంలో అద్దంకిలోని ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. కారు పూర్తిగా దెబ్బతినగా, ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సొసైటీ పాలకవర్గం

పంగులూరు, ఫిబ్రవరి 8: మండలంలోని జాగర్లమూడివారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా జాగర్లమూడి వెంకటరత్నం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ముప్పవరంలోని సొసైటీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ సీఈవో మోహనకృష్ణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. పాలకవర్గ సభ్యులుగా పూసల హనుమంతరావు, బండి ఓబుల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముప్పవరం సర్పంచ్ రౌతు సాంబశివరావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, జాగర్లమూడి యల్లమందరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు పంపిణీ

పంగులూరు, ఫిబ్రవరి 8: పిల్లలలో ఉండే నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో వ్యాధ్యూబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య కోరారు. శుక్రవారం పాఠశాలల్లోని బాల బాలికలకు ఈ మాత్రలు మింగించే కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విద్య, వైద్యాధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. 1నుండి 19 సంవత్సరాల వయస్సుగల వారికి విధిగా మాత్రలు మింగించాలని ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బాల రాజేశ్వరి, ఎంఈవో నాగభూషణం, సూపర్‌వైజర్లు అనూరాధ, హరిబాబు, మదర్షా పాల్గొన్నారు.

ఆశావర్కర్‌ల అక్రమ అరెస్టులు అన్యాయం

చీరాలటౌన్, ఫిబ్రవరి 8: సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటుంటే మహిళలనే సానుభూతి లేకుండా అక్రమ అరెస్టులు చేయించడం అన్యాయమని పలువురు ఆశా వర్కర్‌లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడకు చేపట్టిన కార్యక్రమానికి అనుమతులు లేకపోవడంతో పోలీసులు బుధవారం రాత్రి నుండే ముందస్తు నోటీసులు అందజేశారు. చీరాల పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన సుమారు 30 మందిని ఆయా స్టేషన్‌లకు తరలించారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో సత్ఫలితాలు

కొత్తపేట(చీరాల), ఫిబ్రవరి 8: వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని శాస్త్రవేత్తలు వీరబాబు, దక్షిణామూర్తి, ప్రేమరంజిత పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో గురువారం రైతులకు నిర్వహిచిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేవిధంగా కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సలహా మండలి కోఆర్డినేటర్ ఓబయ్య, ఏడీఏ ఎస్రాయం, ఏవో కాశీవిశ్వనాధ్, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ఆన్స్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

చీరాల, ఫిబ్రవరి 8: సెయింట్ ఆన్స్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగ అధ్యాపకుడు ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేవిధంగా చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఏ మాగ్జిమమ్ పవర్ హార్వెస్టింగ్ ఫర్ ఫోటో వోల్టాయిక్ సిస్టమ్ అండర్ పేస్టల్ షేడింగ్ కండిషన్స్ యూజింగ్ ఏఐ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన చేసి ఆంతోనిరాజ్ డాక్టరేట్ పొందారన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

చీరాల, ఫిబ్రవరి 8: పట్టణ పరిధిలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. ఎక్కడ కూడా పారిశుధ్య చర్యలు సక్రమంగా లేవనే ఫిర్యాదులు అందకూడదని కార్మికులకు చెప్పారు. స్థానిక కమిషనర్ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ ప్రతినిధి కోటిదాసు నేతృత్వంలో కమిషనర్ విజయసారథిని పారిశుధ్య కార్మికులు కలసి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు.

బల్లికురవ తహసీల్దార్‌గా సుభద్ర బాధ్యతల స్వీకరణ

బల్లికురవ, ఫిబ్రవరి 8: బల్లికురవ తహసీల్దార్‌గా ఎం.సుభద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కె.రవిబాబును గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న సుభద్రను బల్లికురవ మండలానికి నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తహసీల్దార్ సుభద్ర మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. రైతులకు ఏవైన సమస్యలు ఉంటే నేరుగా వచ్చి తెలియజేయాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

చినగంజాం, ఫిబ్రవరి 8: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులతో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించి, సరైన వసతులు లేకపోతే కల్పించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు తుది ఓట్ల జాబితాలో తప్పులులేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రీసర్వే డీటీ డి.శ్రీకాంత్, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు

ఇంకొల్లు, ఫిబ్రవరి 8: ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ 33వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించగా గురువారం విజేతలను ప్రకటించారు. విజేతలకు ఈనెల 11న జరిగే వార్షికోత్సవ సభలో బహుమతులు ప్రదానం చేస్తున్నట్టు హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేదూరి సత్యనారాయణ తెలిపారు.